ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
బుధవారం 7 ఫిబ్రవరి 2024



విద్యాసరస్వతీ అమ్మవారు



విద్యాధరి క్షేత్రంలో వైభవంగా
మూల మహోత్సవం

● ఘనంగా లక్ష పుష్పార్చన, చండీహోమం

వర్గల్, ఫిబ్రవరి 6: వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మూలమహోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో తెల్లవారుజామున అమ్మవారి విశేష అభిషేకాలు చేశారు. ఆలయ మండపంలో సరస్వతీ అమ్మవారికి భక్తులతో లక్ష పుష్పార్చన, అలాగే ఆలయ యాగశాలలో చండీహోమం చేశారు. వేడుకలను తిలకించడానికి పరిసర ప్రాంతాలతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. విద్యాధరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.



ఆలయ మండపంలో లక్ష పుష్పార్చన చేస్తున్న భక్తులు, వేద విద్యార్థులు

'ఉపాధి'కి ఊతం
మునగ సాగు



నర్సరీలో పెంచుతున్న మునగ మొక్కలు

● భూమి, జాబ్‌కార్డు ఉంటే రాయితీ
● ఎకరానికి రూ.లక్షన్నర వరకు ● నేరుగా రైతుల ఖాతాల్లోకి..
● జిల్లాలో 50 ఎకరాల్లో సాగు
● ఆసక్తిచూపుతున్న చిన్న, సన్నకారు రైతులు

నారాయణరావుపేట, ఫిబ్రవరి 6: మంచి పోషక విలువలు గల మొక్కగా గుర్తింపు పొందిన మునగ రైతుల పాలిట కల్పవృక్షంలా మారుతోంది.మునగలో ప్రతీ భాగం ఉపయోగకరమే అన్న విషయం తెలిసిందే. అయితే, పంట దిగుబడి, ఇతరత్రా మార్గాల్లో ఆదాయంతో పాటు ఉపాధి హామి పథకం కిందా మునగ రైతులకు ఆర్థిక ప్రయోజనం కలగనున్నది.

ఐదెకరాల్లోపు భూమి ఉండి జాబ్‌కార్డు కలిగిన రైతులకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆర్థికంగా ఊతమందిస్తుంది. పంట మార్పిడి దిశగా అడుగులు వేస్తూ ఆరుతడి పంటల్లో భాగంగా ఇప్పటికే జిల్లాలో సుమారు 50 ఎకరాలకు పైగానే మునగసాగుకు రైతులు సిద్ధమయ్యారు. మొక్కలు నాటిన రైతుల్లో ఇప్పటికే కొందరికి ఉపాధిహామీ పథకంలో చెల్లింపు జరిగాయి.



సాగు చేస్తున్న మునగ తోట

ఎకరాకు రూ.1.41లక్షల రాయితీ

మునగసాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి ఎకరానికి రూ.1.41లక్షల రాయితీ లభిస్తుంది. ఎకరం భూమిలో దాదాపు వెయ్యి మొక్కల వరకు నాటే అవకాశం ఉంటుంది. మునగ సాగులో మొక్కలు నాటేందుకు ఒక్కో గుంతకు రూ.10.88, మొక్క నాటినందుకు రూ.14.41 చొప్పున చెల్లిస్తారు. ఫర్టిలైజర్‌కు ఎకరాకు రూ.12,500, కూలీల ఖర్చు, నిర్వహణ ఖర్చు కలిపి సంవత్సరానికి రూ.1,41,751 ఉపాధిహామీ కింద రైతు ఖాతాలో జమ చేస్తారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



మునగతోటలు సాగు చేయాలనుకునే రైతులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తుంది. మునగ సాగుతో ఉపాధి కూలీలకు పని కల్పించడంతో పాటు రైతులకు ఆర్థికంగా మేలు చేకూరుతుంది.

\- బాల్‌రాజు, ఈజీఎస్ ఏపీడీ సిద్దిపేట



ఫైల్

దరఖాస్తు ఇలా..

మునగసాగు చేసే రైతులు ముందుగా జాబ్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జీరాక్స్‌లను ఉపాధిహామి కార్యాయంలో ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలి. ఉపాధిహామి సిబ్బంది క్షేత్రస్థాయిలో సందర్శించి సాగు విధానంపై అవగాహన కల్పిస్తారు.

సాగు విధానం

మునగ మొక్కలను జూలై నుంచి అక్టోబరు వరకు నాటుకోవచ్చు. ఏ సమయంలో నాటినా జనవరి-ఏప్రిల్‌లో పూత వస్తుంది. మునగసాగులో జిల్లాలోనే నారాయణరావుపేట మండలం గోపులాపూర్ ముందంజలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అంతర పంటగా మిరప, టమాట, బెండ, పెసర, బబ్బర వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవచ్చు. సాగులో మెళకువలు పాటిస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు.

మల్లన్న ఆలయ ఏఈవోకు మెమో జారీ

చేర్యాల, ఫిబ్రవరి 6: ఉచిత దర్శన పాసుల విక్రయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొమురవెల్లి మల్లన్న ఆలయ ఏఈవో శ్రీనివాస్‌కు అధికారులు మెమో జారీ చేశారు. పట్టుబడిన వలంటీర్ల వద్ద లభ్యమైన పాసులు ఏఈవో గంగా శ్రీనివాస్ జారీ చేసినవే కావడంతో ఈవో బాలాజీశర్మ సంజాయిషీ కోరుతూ మెమో జారీ చేశారు. అయితే, ఏఈవో తన వ్యక్తిగత అవసరాలకు ఇరువురు వలంటీర్లను సహాయకులుగా ఏర్పాటు చేసుకోవడం వివాదాస్పదమవుతుంది. ఇందులోనే ఒకరు ఉచిత పాసులతో పట్టుపడ్డారు. దీంతో ఆలయంలో వలంటీర్ల వ్యవస్థపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఈవో బాలాజీశర్మ మాట్లాడారు. వలంటీర్ల వ్యవస్థ గతం నుంచి కొనసాగుతూ వస్తుందని చెప్పారు. అవకతవకలకు పాల్పడుతున్న వలంటీర్లను ఏ మాత్రం ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు.

ప్రత్యేకాధికారులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

● కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 6: గ్రామాల్లో ఈనెల 2 నుంచి బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులుగా విధులు నిర్వర్తించే అధికారులు జవాబుదారితనంతో వ్యవహరించాలని, నూతన పంచాయతీరాజ్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రతి 10 రోజులకు ఒకసారి శుభ్రపర్చాలని పేర్కొన్నారు. ఈనెల 11, 12 తేదీలను వాటర్స్‌డేగా ప్రకటిస్తూ రాబోయే వేసవిని దృష్ట్యా మిషన్‌భగీరథ ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి జయదేవ్ ఆర్యా, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమేష్, మిషన్ భగీరథ ఎస్ఇ శ్రీనివాస్‌చారి, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బృందం పర్యటన

ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ (మర్రి చెన్నారావు హ్యూమన్ రీసోర్సు డెవలప్‌మెంట్) నుంచి కేంద్ర ప్రభుత్వ సెక్టోరియల్ లెవల్-డీ 15 మంది ఉద్యోగుల బృందం సభ్యులు మంగళవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి జిల్లాలో వారి టూర్ షెడ్యూల్‌ను వివరించారు.

చర్యకు ప్రతిచర్య తప్పనిసరి

● ఇక నుంచి వారంలో రెండు రోజులు సిద్దిపేటకు : మైనంపల్లి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీ నాయకులపై చెయ్యి వేస్తే.. చర్యలకు ప్రతిచర్య తప్పకుండా ఉంటుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు మండిపడ్డారు. మంగళవారం రాత్రి సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయ నిర్మాణానికి మైనంపల్లి హనుమంతరావు, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్‌లు భూమిపూజ చేశారు. అంతకుముందు సిద్దిపేటలో రోడ్‌షో నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని తొమ్మిదోవార్డులో పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడారు. తనకు పదవులు ముఖ్యంకాదని, మైనంపల్లి అంటేనే ఒక బ్రాండ్ అని తెలుసుకోవాలని తెలిపారు. ఇక నుంచి వారంలో రెండు రోజులు సిద్దిపేటలో పర్యటిస్తానని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా.. ఏ సమయంలోనైనా తనను సంప్రదించాలని వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన హామీఇచ్చారు. అనంతరం సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మాట్లాడారు. ఇక సినీనిర్మాత, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండ్ల గణేష్ మాట్లాడుతూ మైనంపల్లి మాట ఇస్తే వెనక్కి తగ్గడన్నారు. సిద్దిపేట ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మైనంపల్లి హన్మంతరావును అక్కున చేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, పీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం, గంప మహేందర్, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పూజల గోపికృష్ణ, గూడూరు శ్రీనివాస్, బొమ్మల యాదగిరి, సూర్యవర్మ, కలీముద్దీన్, తాడూరు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మి, గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అజ్మత్, వాహబ్, గయసుద్దీన్, గ్యాదరి మధు పాల్గొన్నారు.



సిద్దిపేట పట్టణంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

బాల్క సుమన్‌పై భగ్గుమన్న కాంగ్రెస్

● సిద్దిపేట జిల్లావ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు
● సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆందోళనలు
● నిరసన ర్యాలీలు, దిష్టిబొమ్మ దహనాలు
● బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్

8 లో



నంగునూరులో బాల్కసుమన్ ఫ్లెక్సీని చెప్పుతో కొడుతున్న కాంగ్రెస్ నాయకులు

విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు

● సంగారెడ్డిలో రీజినల్ నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ ముందడుగు

ఆంధ్రజ్యోతిప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి6: సంగారెడ్డి జిల్లాలో గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడానికి ఎస్పీ చెన్నూరి రూపేష్ కఠిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహితంగా మార్చడం కోసం కార్యాచరణ ప్రారంభించారు. ఇందులో భాగంగా సంగారెడ్డిలో త్వరలోనే రీజినల్ నార్కోటిక్ కో-ఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు కలిపి ఈ సెంటర్ పనిచేయనున్నది. సెంటర్‌లో పనిచేసే సిబ్బంది క్షేత్రస్థాయిలో పోలీసులు నమోదు చేసిన డ్రగ్స్ కేసుల విచారణ, పరిశోధనకు సహకరిస్తారని ఎస్పీ చెన్నూరు రూపేశ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

డ్రగ్స్ బాధితులను గుర్తించేందుకు టీ-న్యాబ్ నుంచి కిట్లు

మద్యం తాగిన విషయం తెలుసుకునే కిట్ల మాదిరిగానే గంజాయి, డ్రగ్స్ వాడకం గురించి తెలుసుకునేందుకు ప్రత్యేక కిట్లను జిల్లాకు తెప్పిస్తున్నారు. అవి ఇప్పటికే టీ-న్యాబ్ నుంచి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి చేరుకున్నాయి. త్వరలోనే వీటితో పరీక్షలు నిర్వహించనున్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ చైర్మన్‌గా..

గంజాయి, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. కంది శివారులోని ఐఐటీ, రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయం, సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్‌ఆర్ విద్యాసంస్థలు, వోక్సెన్ విశ్వవిద్యాలయం, సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలతో పాటు అన్ని కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయిస్తున్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలలో విద్యార్థులు సభ్యులుగా ఉంటారు. వీరందరితో వచ్చే వారంలో గీతం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఎస్పీ సమావేశమై, డ్రగ్స్, గంజాయి వాడడంతో జరిగే నష్టాల గురించి వివరించనున్నారు.

విద్యాసంస్థల పరిసరాల్లో నిఘా

జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు కిలోమీటరు దూరంలో పాన్‌షాపులు లేకుండా చూస్తున్నామని ఎస్పీ రూపేష్ తెలిపారు. పాన్‌షాపుల్లో విదేశాల నుంచి తెప్పించిన సిగరెట్లు, గంజాయి చాక్‌లెట్లు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ జరిపిస్తున్నామన్నారు.

గులాబీ తోటలో పాగా వేసేదెవరు!

● మెదక్ టికెట్ కోసం పోటాపోటీ
● బీఆర్‌ఎస్‌లో 'వంటేరు'కు అధినేత గ్రీన్‌సిగ్నల్?
● కాంగ్రెస్‌లో జగ్గారెడ్డి, మైనంపల్లి, తదితరులు
● బీజేపీలో ముగ్గురు నేతలు


ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 6: మెదక్ ఎంపీ టికెట్ కోసం ప్రధాన పార్టీల్లో పోటాపోటీ నెలకొన్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు చోట్ల గెలిచి బీఆర్‌ఎస్ సత్తా చాటింది. మెదక్ సెగ్మెంట్‌లో మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. అసెంబ్లీ ఫలితాలతో సబంధం లేకుండా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఈ సీటును కైవసం చేసుకునేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ప్రయత్నిస్తున్నాయి.

ఎవరి ధీమా వారిది

తన సిట్టింగ్ స్థానంలో మరోసారి గెలిచి మెదక్ అంటే బీఆర్‌ఎస్ కంచుకోట అని చాటాలని గులాబీ పార్టీ బలంగా ప్రయత్నిస్తున్నది. రాష్ట్రంలో అధికారం చేపట్టి ఊపుమీదున్న కాంగ్రెస్ మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కోటను బద్దలు కొట్టి సత్తా చాటాలని పట్టుదలతో ఉన్నది. మరోవైపు, అయోధ్య రామ మందిర నిర్మాణం, ప్రధాని మోదీ చరిష్మాపై బీజేపీ ఆశలు పెట్టుకున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో తమకు మంచి ఫలితాలే వచ్చాయని, పార్లమెంట్ ఎలక్షన్లలోనూ అదే హవా కొనసాగిస్తామని కమలం పార్టీ శ్రేణులు ధీమాతో ఉన్నాయి. ఇలా అన్ని పార్టీల్లోనూ ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. దీంతో ఎవరికి టికెట్ వస్తున్నదో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది.

బీఆర్‌ఎస్ నుంచి ప్రతాప్‌రెడ్డికి అవకాశం!

బీఆర్‌ఎస్ టికెట్ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, గజ్వేల్‌కు చెందిన వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఈమేరకు గులాబీ అధినేత కేసీఆర్ ఇప్పటికే సిగ్నల్ ఇచ్చారని ప్రచారంలో ఉన్నది. బీఆర్‌ఎస్ టికెట్ కోసం ఆశావహులు ఎక్కువగానే ఉన్నా.. ఎమ్మెల్సీ వెంకట్‌రాంరెడ్డిని ఎంపీగా పోటీ బరిలో దింపుతారని ప్రచారం జరిగింది. ఇందుకు తగినట్టే ఆయన నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సరం, సంక్రాంతి పండగలకు శుభాకాంక్షలు తెలుపుతూ సందేశాలు పంపించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని పట్టణాల్లో విలేకరులతో సమావేశం కావాలని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ, కుటుంబసభ్యుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆయన పోటీ నుంచి తప్పుకున్నట్టు తెలిసింది. ఎమ్మెల్సీగా ఇంకా మూడున్నర సంవత్సరాల పదవీ కాలం ఉండడం, కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి రావడం, ఆయన సోదరుడు.. మంత్రి పొంగులేటి సోదరుడితో వియ్యం అందుకుంటుండడంతో ఎంపీగా బరిలో దిగడంపై పునరాలోచనలో పడినట్టు భావిస్తున్నారు. మరోవైపు, మెదక్ ఎంపీగా తనకు అవకాశం ఇస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలుపుకోవాలని నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పార్టీ అధినేత, తన మిత్రుడు కేసీఆర్‌ను కోరుతున్నారు. అలాగే, తెలంగాణ ఉద్యమంలో జిల్లాలో క్రియాశీలకంగా పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి జి.బీరయ్య యాదవ్ కూడా తమకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు.



కాంగ్రెస్‌లో హేమాహేమీలు

కాంగ్రెస్ టికెట్‌కు మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. కానీ వీరిద్దరూ టికెట్ కోసం పార్టీకి దరఖాస్తు చేసుకోలేదని తెలిసింది. వీరిద్దరితో పాటుఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీ విజయశాంతి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నది. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యే టి.నర్సారెడ్డి, దుబ్బాకకు చెందిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, బండారు శ్రీకాంత్ కూడా తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

బీజేపీ టికెట్ ఎవరికో?

బీజేపీ నుంచి మెదక్ టికెట్ కోసం మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. తనకు మల్కాజిగిరి లేదా కరీంనగర్ ఎంపీ టికెట్ ఇవ్వాలని ఈటల రాజేందర్ కోరుతున్నట్టు తెలిసింది. అయితే కరీంనగర్ నుంచి సిట్టింగ్ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ మరోసారిపోటీకి సిద్ధంగా ఉన్నారు. ఇక మల్కాజ్‌గిరి టికెట్ కూడా ఈటలకు ఇచ్చే అవకాశాలు లేవని, ఆయన ఒప్పుకుంటే మెదక్ టికెట్ ఇచ్చే అవకాశాలున్నాయని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

మరోవైపు దుబ్బాక మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు కూడా మెదక్ ఎంపీగా పోటీ చేయాలని ఉత్సాహంతో ఉన్నారు. తనకు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో పట్టున్నదని, టికెట్ ఇస్తే విజయం సాధిస్తానని ఆయన అగ్రనేతలకు వివరించినట్లు తెలిసింది. అలాగే, ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం, మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడుతుండడంతో తనకు టికెట్ ఇవ్వాలని జిల్లా మాజీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి కోరుతున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై ఆయన నమ్మకం పెట్టుకున్నారు. ఏమైనా ఈ నెలలో ఎన్నికల షెడ్యూల్ రావచ్చుంటున్న నేపథ్యంలో ఆయా పార్టీలలో టికెట్ల కోసం నేతల పోటీ ఆసక్తకరంగా మారింది.

కుష్ఠు నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలి

● వైద్య ఆరోగ్యశాఖ డీపీఎంలు

కంది, ఫిబ్రవరి 6: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలని వైద్యఆరోగ్య శాఖ లెప్రసీ విభాగం డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లు మారుతి, ప్రతాప్‌గౌడ్ అన్నారు. కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కుష్ఠు వ్యాధి వ్యాప్తి, నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలుంటే అప్రమత్తమై దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కుష్ఠు వ్యాధికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. అనంతరం పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి పొగాకు వాడకం, అనర్థాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ డీపీఎంలు, సిబ్బంది


తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ

హత్నూర, ఫిబ్రవరి 6: తాళం వేసిన రెండిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. హత్నూర పరిధిలోని రెడ్డిఖానాపూర్ గ్రామానికి చెందిన వడ్ల కల్యాన్‌చారి, దేవనోల్ల శివరాజ్ వేరే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇరుగుపొరుగు వారి ద్వారా విషయం తెలుసుకున్న ఇళ్ల యజమానులు మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు ఇళ్లలో నగదు, నగలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు.



ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేసిన దృశ్యం

ప్రత్యేకాధికారులకు మొదటి టాస్క్


కోహీర్ మండలంలోని సజ్జాపూర్ గ్రామం

- నేటి నుంచి గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్
- పంచాయతీల్లో వేధిస్తున్న నిధుల కొరత
- మెదక్ జిల్లాకు రావాల్సిన రూ.20.25 కోట్లు
- మూడు విడతల్లో ఎస్ఎఫ్‌సీ నిధులు పెండింగ్
- జిల్లాలో 469 జీపీలకు.. 469 మంది స్పెషలాఫీసర్లు


మెదక్ అర్బన్: మల్కాపూర్ గ్రామంలో రోడ్లను శుభ్రం చేస్తున్న గ్రామస్థులు(ఫైల్)

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 6: గ్రామపంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ఇటీవల ముగిసింది. ఈనెల 2 నుంచి స్పెషలాఫీసర్ల పాలన ప్రారంభమైంది. దాంతో రాష్ట్ర సర్కార్ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించింది. నేటి బుధవారం నుంచి 15వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించింది. ప్రత్యేకాధికారుల పాలన మొదలైన తర్వాత మొదటి కార్యక్రమం ఇది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. కానీ, నిధులు కేటాయింపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడం గమనార్హం. మెదక్ జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లోని 469 గ్రామపంచాయతీలకు 469 మందిని ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది.

సర్కార్ మార్క్ కనిపించేలా

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెప్రగతి పేరిట ఏటా జూన్, జూలై నెలల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టేది. ఇందుకోసం ముందుగానే గ్రామాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసేది. గత సర్కార్ మాదిరిగానే పల్లె పాలనపై తమదైన ముద్ర వేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, ప్రత్యేకాధికారులతో 3న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క వారంరోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్దేశించారు. 7 నుంచి 15 వరకు అన్ని గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు, మహిళా సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆ మేరకు పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు.

ప్రత్యేకాధికారులకు సవాల్

సర్పంచుల స్థానంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీవోలు, ఆర్ఐ, విద్య, మిషన్‌భగీరథ అధికారులను పంచాయతీ పాలనతో సంబంధం లేకుండా స్పెషలాఫీసర్లుగా నియమించారు. నేటి నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభమవుతున్నది. అయితే ప్రభుత్వం నిధులు ఇస్తేనే పారిశుధ్య, తాగునీటి సమస్య పరిష్కరించే అవకాశం ఉన్నది. ప్రస్తుతం చిన్నపాటి పనులు చేసేందుకు పలు జీపీల్లో పైసా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఏ విధంగా పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. పంచాయతీల స్పెషలాఫీసర్లుగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన అధికారులకు ఇది మొదటి సవాల్‌గా నిలువనున్నది.

వేధిస్తున్న నిధుల కొరత

జిల్లాలో ఉన్న పంచాయతీలన్నీ నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. చేసిన పనులకు బిల్లులు రాలేదని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని చాలా పంచాయతీల్లో నిధుల సమస్య నెలకొన్నది. జిల్లాకు మరో వైపు పంచాయతీలకు రావాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘం(ఎస్ఎఫ్‌సీ) నిధులు మూడు విడతలకు సంబంధించి రూ.20.25 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పనితీరు ఆధారంగా ఉత్తమ జీపీల ఎంపిక

కోహీర్ ఫిబ్రవరి 6: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ చివరిరోజు ఫిబ్రవరి 8న పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించి చేసిన పనులపై అధికారులు సమీక్షించనున్నారు. మద్యపానం, మత్తు పదార్థాలు, గుట్కా వంటి వాటికి యువత దూరంగా ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. అనంతరం పనితీరు ఆధారంగా జిల్లాస్థాయిలో ఉత్తమ జీపీలను ఎంపిక చేయనున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన కార్మికులు, గ్రామపంచాయతీలకు కలెక్టర్ ఆధ్వర్యంలో అవార్డులు అందజేస్తారు. అంతేకాకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో చేపట్టిన పనులకు సంబంధించి ఫొటో సెషన్ ఏర్పాటు చేయనున్నారు.

చేపట్టే పనులివి..


పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా అవగాహన కల్పిస్తారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాల తొలగింపు, ఉపయోగపడని బావులను పూడ్చివేయడం, రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచడం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడం వంటి పనులు చేపడుతారు. మురుగు కాలువల్లో వ్యర్థపు నీరు నిల్వ ఉండకుండా పూడిక తీయడం, వీధుల్లో గుంతలను పూడ్చడం, దోమలు వృద్ధి చెందకుండా రసాయనం పిచికారీ చేయడం వంటివి స్పెషల్ డ్రైవ్‌లో చేయనున్నారు.

సొంత వనరులతో నిర్వహణ




గ్రామపంచాయతీల్లో ఉన్న సొంత వనరులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ప్రత్యేకంగా ఎలాంటి నిధులు విడుదల కాలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) గత మూడు విడతల పెండింగ్‌లో ఉన్నది. కేంద్రం ఇచ్చే 15 ఆర్థిక సంఘం నుంచి ప్రతి నెల నేరుగా గ్రామపంచాయతీ జీరో ఖాతాల్లో జమవుతున్నాయి. విడుదలైన నిధులను అన్ని గ్రామపంచాయతీల్లో నిబంధనల ప్రకారం ఖర్చు చేసేలా చూస్తున్నాం.

- సాయిబాబా,
జిల్లా పంచాయతీ అధికారి, మెదక్









భూములు అన్యాక్రాంతం కావొద్దు: కలెక్టర్ క్రాంతి


వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: సంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, వాటి చుట్టూ రెండు వరుసల్లో మొక్కలు నాటాలని సూచించారు. పాఠశాలలు కళాశాలలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించి ప్లాంటేషన్ చేయాలని, పురపాలికల్లోని అన్ని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని, ఆరు ఫీట్ల మొక్కలు నాటాలన్నారు. రాజీవ్ పార్కు అభివృద్ధికి అంచనా వేసి ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్‌కు ఆదేశించారు. వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు.

అంగన్‌వాడీ భవనాలను పూర్తి చేయండి

జిల్లాలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. అంగన్‌వాడీ పరిధిలోని (సామ్, మామ్) లోప పోషణతో ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టిసారించి సాధారణ స్థితికి వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న వృద్ధాశ్రమం పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. వృద్ధాశ్రమానికి అవసరమైన ఫర్నిచర్, బెడ్స్ వంటి ఏర్పాట్లకు ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నారాయణఖేడ్ బాలసదనానికి కూడా ప్రతిపాదనలు అందజేయాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీడబ్ల్యూవో సంధ్యారాణి, మున్సిపల్ కమిషనర్ సుజాత, వివిధ శాఖల ధికారులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

టేక్మాల్, ఫిబ్రవరి 6: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టేక్మాల్ మండలం వెంకటాపూర్‌కు చెందిన ఉప్పరి అమృతి(45) చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. సోమవారం పాపన్నపేట మండంలోని నార్సింగికి వెళ్లొస్తానని తెలిపాడు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు బావి వద్దకెళ్లి చూసే సరికి ఉరేసుకుని కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.



పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

- మెదక్ కలెక్టర్ రాజర్షిషా


పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 6: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అర్హులను కోరారు. మంగళవారం తన ఛాంబర్‌లో జిల్లా అధికారులతో పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుల వృత్తుల వారిని గుర్తించి నైపుణ్యాలను అభివృద్ధి చేసి, వారికి ఆర్థికంగా చేయూతనిచ్చి జీవనోపాధిని పెంపొందించేందుకే ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పథకంపై పట్టణ, మండలాల్లో స్వయం సహాయక బృందాలు, పట్టణాభివృద్ధి సంస్థ రిసోర్స్ పర్సన్స్ ద్వారా విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు కృష్ణమూర్తి, సాయిబాబా, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, మెప్మాపీడీ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

పది, ఇంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

తూప్రాన్, ఫిబ్రవరి 6: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధ్యాపకులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మంగళవారం తూప్రాన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీహెచ్ఎస్ పాఠశాల, తెలంగాణ గురుకుల కళాశాలను ఇంటర్ జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌తో కలిసి కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. పది, ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇంటి వద్ద తీసుకోవాల్సిన చర్యలు, ప్రిపరేషన్ గురించి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న అల్పాహారాన్ని పరిశీలించి రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయచందర్, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు. అలాగే తూప్రాన్ మండల పరిధిలోని ఘణపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను జడ్పీసీఈవో శైలేష్ మంగళవారం సందర్శించి, ఉత్తమ ఫలితాలకై ఉపాధ్యాయుల, విద్యార్థులు కృషి చేయాలని సూచించారు.

లష్కర్‌వారం బుకింగ్ ఆదాయం రూ.55.70లక్షలు


బుకింగ్ కార్యాలయ కౌంటర్‌లో బారులుతీరిన భక్తులు

చేర్యాల, ఫిబ్రవరి 6: కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోవారాన్ని పురస్కరించుకుని భక్తులు భారీగా తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నందున రూ.55.70 లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. భక్తులు మొక్కుబడులుగా సమర్పించిన తలనీలాలు, నిర్వహించిన ఆర్జితసేవలు, రచించిన పట్నాలు, బోనాలు, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల అద్దె తదితరాల ద్వారా శనివారం రూ.3,69,032, ఆదివారం రూ.45,65,237, సోమవారం రూ.6,36,195 చొప్పున మొత్తం రూ.55,70,464 ఆదాయం సమకూరింది. గతేడాది సుమారు రూ.37.99లక్షలు రాగా.. ఈయేడాది సుమారు రూ.17.70 లక్షలు పెరిగింది. జాతరకు తోడు మేడారం భక్తులు తరలివస్తుండటంతో మూడువారాల్లో గతేడాదికన్నా అధికంగా బుకింగ్ ఆదాయం సమకూరుతున్నది.



హుస్నాబాద్: బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ..

జిల్లాలో వెల్లువెత్తిన నిరసనలు



దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు



ములుగు: రాజీవ రహదారిపై దిష్టిబొమ్మను దహనం చేస్తున్నకాంగ్రెస్ నాయకులు



చేర్యాలలో బాల్క సుమన్ ఫ్లెక్సీకి నిప్పంటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డిపై చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం జిల్లావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు నిరసన ర్యాలీలు, దిష్టిబొమ్మ దహనాలు చేపట్టాయి. పలుచోట్ల పోలీస్ స్టేషన్లలో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదులు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

హుస్నాబాద్, ఫిబ్రవరి 6: హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట చౌరస్తాలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. బాల్క సుమన్ దిష్టిబొమ్మకు చెప్పుల దండలు వేసి ఉరి తీశారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా వ్యాఖ్యలు చేసిన సుమన్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేశ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచితవ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు బాల్క సుమన్ ఫ్లెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, మార్కెట్ కమిటీ మాజీవైస్ చైర్మన్ కాటం మల్లేశం మాట్లాడుతూ.. బాల్క సుమన్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పచ్చిమడ్ల వెంకటయ్య, వెలుగల రఘువీర్, ఎలగల మల్లేశం, గూడెపు మహేశ్, తుమ్మపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావరణలో మాజీ ఎంపీపీ రామ గల్ల పరమేశ్వర్ విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మెప్పు పొందేందుకు బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకుని వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

● **దుబ్బాక:** సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌పై మంగళవారం దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కొంగరిరవి, మున్సిపాలిటీ అధ్యక్షుడు ఏసురెడ్డి, నాయకులు అనంతుల శ్రీనివాస్, శ్రీరాంనరేందర్, రాజులు ఫిర్యాదు చేశారు.

● **గజ్వేల్:** బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పినా ఇంకా బీఆర్ఎస్ నాయకుల్లో మార్పు రాలేదన్నారు. సీఎం పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డిపై నోరు పారేసుకోవడం తగదన్నారు. సమావేశంలో నాయకులు బాలాగౌడ్, కొడకండ్ల బాలు తదితరులు ఉన్నారు.

●**ములుగు:** ములుగు రాజీవ్ రహదారిపై కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండు నర్సింహులు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ నరసింహారెడ్డి, చింతకింది రాజు, రాములు, తూర్పుంటి రాజు, ఐలయ్య, స్వదేశ్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

● **బెజ్జంకి:** బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ నాయకులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోచయ్య, టౌన్ ప్రెసిడెంట్ రాజు, జిల్లా కిసాన్‌సెల్ ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు మల్లేశం, నాయకులు ఉన్నారు.

● మిరుదొడ్డి: చెన్నూరు మాజీఎమ్మెల్యే బాల్క సుమన్ మతితప్పి మాట్లాడుతున్నారని కాంగ్రెస్‌పార్టీ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు మద్దెల రాజేశం మండిపడ్డారు. మంగళవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలను చేస్తున్న బాల్క సుమన్ గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. సమావేశంలో భూమాగౌడ్, సుదర్శన్, కనకారెడ్డి, అంజాగౌడ్ తదితరులున్నారు.

● **నంగునూరు:** నంగునూరులో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తప్పేట శంకర్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నికల్లో ఓడించినా బీఆర్ఎస్ నేతలకు బుద్ధి రావడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు చెలికాని యాదగిరి, గోనెపల్లి శివ, బాగు శ్రీకాంత్, రాగుల కృష్ణ, జంగిటి శ్రీనివాస్, దాసరి కిషన్, గౌరబోయిన సంపత్, రాగుల కనకయ్య, శ్రీనివాస్ రెడ్డి, చేర్యాల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

● **కొండపాక:** ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించడంతో స్పృహ కోల్పోయి బాల్క సుమన్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, కుకునూరుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

తిమ్మారెడ్డిపల్లిలో పట్టపగలు చోరీ



ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

కొండపాక, ఫిబ్రవరి 6: మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో ఓ ఇంట్లో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మారెడ్డిపల్లికి చెందిన చిలుముల కొండల్ అనే వ్యక్తి ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని వస్తువులను చిందర వందర చేశారు. ఈ సందర్భంగా ఇంట్లో గల రూ.3 లక్షల నగదును అపహరించారు. కుకునూరుపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 6 : సిద్దిపేట పట్టణంలో డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇటీవల పట్టుబడిన ఐదుగురిని సిద్దిపేట అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి. శ్రావణి ఎదుట హాజరుపరచగా జరిమానా విధించినట్టు సిద్దిపేట వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. సీఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా అడిషనల్ జేఎఫ్‌సీఎం శ్రావణి ఒక్కొక్కరికి రూ. 5,300 చొప్పున జరిమానా విధించారు. నిందితుల్లో ఒకరికి జరిమానాతో పాటు ఒకరోజు జైలుశిక్ష విధించారు.

ఇసుక అక్రమ తరలింపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

మద్దూరు, ఫిబ్రవరి 6: ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలోని వల్లంపట్ల గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి 4 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు స్టేషన్ పరిధిలోని వల్లంపట్ల గ్రామ శివారులో సోమవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో దాడులు నిర్వహించి మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. రాజగోపాలపేట గ్రామ శివారులో ఇసుక తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను పట్టుకుని స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

నిలువ నీడ లేకుండా చేశారు.. న్యాయం చేయండి

● పంచాయతీ అధికారులపై ఆర్డీవోకు ఫిర్యాదు



మాట్లాడుతున్న మల్లమ్మ

హుస్నాబాద్, ఫిబ్రవరి 6: తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే తమ ఇంటిని కోడలి పేరిట రికార్డుల్లో పేరు మార్చిన పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని గాంధీనగర్ పంచాయతీ పరిధి మదిర గ్రామమైన కిషన్‌నగర్‌కు చెంది చాతబోయిన మల్లమ్మ అనే వృద్ధురాలు మంగళవారం ఆర్డీవో బెన్‌షాలోమ్‌కు ఫిర్యాదు చేసింది. అనంతరం ఐవోసీ కార్యాలయం వద్ద విలేకరుల ఎదుట తన గోడు వెల్లబోసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిషన్‌నగర్ గ్రామానికి చెందిన చాతబోయిన మల్లమ్మకు ముగ్గురు కుమారులు ఉండగా అందరికీ పెళ్లిలు జరిగాయి. భర్త రాములు గుండెపోటుతో నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. అందరూ ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్న సమయంలో అప్పులు చెల్లించేందుకు బ్యాంక్ రుణం తీసుకోవాలనుకున్నారు. చిన్నకుమారుడు నరేష్‌కు ఐటీ రిటర్న్ ఉండటంతో అందరూ కలిసి కిషన్‌నగర్‌లోని ఇంటిని నరేష్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. అయితే లోన్ తీసుకోకుండానే చిన్న కుమారుడు కరోనా వ్యాధితో మృతి చెందాడు. ప్రస్తుతం మృతి చెందిన కుమారుడి భార్య సునీత కుటుంబ సభ్యులకు ఎవరికీ తెలియకుండా ఇంటిని తన పేరిట మార్పిడి చేసుకుందని మల్లమ్మ వాపోయింది. ఇంటి పేరు మార్పిడి విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శికి మొరపెట్టుకున్నా మంత్రి సీతక్క ఆదేశాలున్నాయంటూ, వారి పీఏ ఒత్తిడి చేస్తున్నారని ఎలాంటి విచారణ చేయకుండానే పేరు మార్పిడి చేశారని తెలిపింది. ఈ విషయంపై ఎంపీవో, డీఎల్‌పీవో, డీపీవోలకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తాను రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు.ఈ ఘటనపై విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని వేడుకొన్నది.

మహంకాళి ఆలయంలో జడ్పీచైర్‌పర్సన్ పూజలు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 6: పండగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పేర్కొన్నారు. మండలంలోని విఠలాపూర్ గ్రామంలో రెడ్డిసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహంకాళీమాత ఆలయ పంచమ వార్షికోత్సవాల్లో మంగళవారం ఎంపీపీ మాణిక్యరెడ్డితో కలిసి ఆమె పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, రెడ్డిసంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ట్రాఫిక్ సీఐ బాధ్యతల స్వీకరణ

గజ్వేల్, ఫిబ్రవరి 6: గజ్వేల్ ట్రాఫిక్ సీఐగా ఎం. మురళీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిద్దిపేట కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు.

కేసీఆర్‌తోనే జిల్లా అభివృద్ధి

గజ్వేల్, ఫిబ్రవరి 6: మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావులతోనే సిద్దిపేట జిల్లా అభివృద్ధి చెందిందని టీఎస్ ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నవాజ్, ఇక్బాల్, శ్రీనివాస్, భిక్షపతి, స్వామి, నరేశ్, కుమార్, జోడు ప్రకాశ్, అఖిల్ తదితరులున్నారు.

కనుల పండువగా శంభుదేవుడి బ్రహ్మోత్సవాలు





ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం, ఆలయ ఆవరణలో భక్తుల సందడి

కొండపాక, ఫిబ్రవరి 6: మండలంలోని దుద్దెడలో స్వయంభు శంభు దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెడో రోజైన మంగళవారం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శంభు దేవునికి అన్నాభిషేకం, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ రుద్రమన్య పాశుపత హవనం, సుదర్శన హోమం, చండీ హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు సభ్యులు భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించారు. ఉత్సవాల్లో గ్రామస్థులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉత్సవాలతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో రద్దీగా మారింది.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గూడెం గ్రామస్థులు

బెజ్జంకి, ఫిబ్రవరి 6: అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు స్థలాలు కేటాయించి పట్టాలు ఇప్పించాలని మండలంలోని గూడెం గ్రామస్థులు కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు వేర్వేరుగా వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని గూడెం గ్రామంలో సర్వే నెంబర్ 321లో 13.26 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఆ స్థలంలో కొందరు గ్రామస్థులు పశువుల పాకలను వేసుకొని జీవనోపాధి పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల అధికారులు ప్రభుత్వ స్థలంలో వేసుకున్న పశువుల పాకలను తొలగించారని వాపోయారు. ఆ ప్రభుత్వ స్థలంలో ఇళ్లను నిర్మించుకునేందుకు గ్రామంలోని అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కాగా మరికొంత మంది గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ఇళ్ల కట్టుకోవడానికి అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్ శ్యాంకు వినతి పత్రాన్ని అందజేశారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



బయ్యారంలో సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న ఏడీఏ బాబునాయక్

గజ్వేల్, ఫిబ్రవరి 6: వరిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని దాచారం, క్యాసారం, బయ్యారం గ్రామాలలో వరి పొలాలను ఆయన ఏఈవోతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా యాసంగి వరి పంటలో పిలకదశ, నాటు వేసే దశలో ఉందని, ఈ దశలో మొగిపురుగు, సల్ఫైడ్ ధాతువు వలన పంటకు నష్టం కలుగుతుందన్నారు. సల్ఫైడ్ ధాతువు వల్ల పొలంలో వరి వేర్లు కుళ్లి, పిలకలు మాడినట్లు, ఎండినట్లు లక్షణాలు కనిపిస్తాయన్నారు. చవుడు నెలలో అధికంగా వస్తుందని, దీని నివారణకు, వరి పొలంలో నీటిని తీసివేసి పొలాన్ని ఆరబెట్టాలని సూచించారు. తడి, పొడి పద్ధతిలో నీటి తడులు వేసుకోవాలని, మల్టికే మందును పిచికారి చేయాలన్నారు. మొగిపురుగు ఉధృతిని బట్టి 4జీ కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరాకు ఆరు కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ పొడి మందును 0.5మిల్లీలీటర్ల మందును లీటర్ నీటికి కలిపి ఎకరానికి 200లీటర్ల ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. 15రోజుల తర్వాత పలుచగా ఎకరాకు 20కిలోల యూరియా వేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే స్థానిక ఏవో, ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. వారితో ఏఈవోలు జ్యోతి, మాధవి, రైతులు ఉన్నారు.

మైనంపల్లికి కాంగ్రెస్ శ్రేణుల ఘనస్వాగతం



గజ్వేల్‌లో మైనంపల్లికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్/కొండపాక, ఫిబ్రవరి 6: సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయ భూమి పూజకు భారీ కాన్వాయ్‌తో వెళ్తున్న క్రమంలో గజ్వేల్ పట్టణంలో మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావులకు గజ్వేల్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు మంగళవారం ఘనస్వాగతం పలికారు. భారీ గజమాలలతో వారిని సత్కరించారు. అనంతరం మైనంపల్లి హనుమంతరావు ఇందిరాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాగతం పలికినవారిలో డీసీసీ ప్రెసిడెంట్ తూంకుంట నర్సారెడ్డి, నాయకులు నాయిని యాదగిరి, సర్దార్‌ఖాన్, బెజుగామ శివారెడ్డి, గోపాల్‌రావు, సయ్యద్ మతీన్, బంగార్‌రెడ్డి, జంగం రమేశ్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, నేత నాగరాజు, అజమర్, షాహేద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొండపాక మండలంలో మైనంపల్లి హనుమంతరావుకు మండల కాంగ్రెస్ నాయకులు సాయంత్రం ఘనస్వాగతం పలికారు. టోల్‌ప్లాజా వద్ద కొండపాక, కుకునూరుపల్లి మండలాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు లింగారావు, శ్రీనివాస్‌రెడ్డి మైనంపల్లిని ఘనంగా స్వాగతించారు. వారి వెంట వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి: ఎంవీఐ



డ్రైవర్లను సన్మానిస్తున్న ఎంవీఐ కవిత

గజ్వేల్, ఫిబ్రవరి 6: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎంవీఐ కవిత పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్‌డిపోలో మంగళవారం నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించాలన్నారు. విధులు ముగించుకున్న అనంతరం సమయం వృథా చేయకుండా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దీంతో ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. వారితో డిప్యూటీ రీజనల్ మేనేజర్ ద్వైవాదీనం, డిపో మేనేజర్ సురేఖ, ఎస్‌టీఐ కనకలక్ష్మి, డిపో సిబ్బంది ఉన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు

ఎంపికైన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులకు సన్మానిస్తున్న హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

చేర్యాల, ఫిబ్రవరి 6: ఈ నెల 7 నుంచి 14వ తేదీవరకు రాజస్థాన్‌లోని చిత్తోర్ఘర్‌లో జరుగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన చేర్యాల మండలవిద్యార్థులు సౌమ్య, సంజయ్, హేమచందర్‌లను మంగళవారం మండల హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక షాదీఖానా ఆవరణలో మెరుగు శ్రీనివాస్, పీడీ రఫత్ ఉమర్, కొండయ్య, అఖిల్ శాలువా కప్పి సన్మానించారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల హెచ్ఎం రంగ

అక్కన్నపేట, ఫిబ్రవరి 6: ఈ నెల 8, 9 తేదీల్లో హనుమకొండ జిల్లా కేంద్రంలోని జెఎన్ఎంఎస్‌లో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు మండలంలోని మల్లంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుగూలోతు రంగ మంగళవారం తెలిపారు. ఎంపికైన వారిలో మాలోతు కళ్యాణ్‌రామ్, నితిన్, సాయికిరణ్, అక్షయ్, అక్షిత్, ఎనగందుల అంజనాసౌమ్య, మాటూరి అక్షిత, లావుడ్యా రాకేష్ ఉన్నారు. ఎంపికైనవారిని రాష్ట్ర రెజ్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ కరీం, ఉపాధ్యాయులు అభినందించారు.

స్వచ్ఛబడి నాటక పోటీల్లో

వెంకట్రావ్‌పేట పాఠశాలకు ద్వితీయస్థానం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తొగుట, ఫిబ్రవరి 6: సిద్దిపేటలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి స్వచ్ఛబడి నాటక పోటీలలో మండలంలోని వెంకట్రావ్‌పేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు ద్వితీయ స్థానం దక్కింది. ప్లాస్టిక్ వల్ల నష్టాలు అనే అంశంపై నిర్వహించిన సింగిల్ యూస్ నాటకంలో పాఠశాల విద్యార్థుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నాటకంలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శ్రీకాంత్, ఐశ్వర్య, అశ్విత, యశ్వంత్, నవీన్‌లకు రూ.2వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు.

నాటక పోటీల్లో దుద్దెడ విద్యార్థుల ప్రతిభ

కొండపాక, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ పాఠశాలల మండలస్థాయి ఇంగ్లిష్ సబ్జెక్టుపై నిర్వహించిన స్పెల్ విజార్డ్ డ్రామా పోటీల్లో దుద్దెడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తెలిపారు. ఈ నెల 13న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు డ్రామా పోటీలకు ఎన్నికైన 9వ తరగతి విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రబాను, యాదగిరి,కిరణ్మయి ,రజిని, లక్ష్మణరావు, రాధాకృష్ణ , శ్రీదేవి,భారతి, అరుణ, ఉమారాణి, హైమావతి ,జానకి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలో జక్కాపూర్ విద్యార్థుల ప్రతిభ

నారాయణరావుపేట, ఫిబ్రవరి 6; విద్యార్థులు శ్రమించే తత్వాన్ని అలవర్చుకోవాలని నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షౌకత్ అలీ పేర్కొన్నారు. సిద్దిపేటలో మంగళవారం జిల్లాస్థాయిలో నిర్వహించిన సాంఘికశాస్త్రం, గణిత శాస్త్రం ప్రతిభా పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సౌకత్ అలీ మాట్లాడుతూ గణితంలో తమ పాఠశాల పదో తరగతి విద్యార్థులు దుబ్బాక జశ్వంత్ జిల్లా ప్రథమస్థానం, సిరిసిల్ల సమీక్ష తృతీయస్థానంలో విజేతలుగా నిలువడం అభినందనీయమన్నారు. సాంఘిక శాస్త్రం విభాగంలో మిద్దె గణేష్, ఎదుల్లా అభిషేక్, గుడెపు వైష్ణవి, ఏర్వ హన్సిక ప్రతిభ చూపినందుకు బహుమతులు అందజేశారు. అనంతరం గణిత శాస్త్రం ఉపాధ్యాయులు పాతురి తిరుపతి రెడ్డి, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు కొమ్మూరి పద్మ, లక్క రాజులను సన్మానించారు.


రవీంద్ర భారతిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం



రవీంద్రభారతిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న సిద్దిపేట ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 6: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిద్దిపేట ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల హాజరై తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, వీలైనంత త్వరగా పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

జనగామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కమలాకర్



నియామక పత్రాన్ని అందజేస్తున్న కొమ్మూరి

మద్దూరు, ఫిబ్రవరి 6 : మద్దూరు ఉమ్మడి మండలం కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న దూళిమిట్ట మండలం జాలపల్లి గ్రామానికి చెందిన చెట్కూరి కమలాకర్ యాదవ్‌ను జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్‌పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా కమలాకర్ యాదవ్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

దుబ్బాక నియోజకవర్గాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతా..

● నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, ఫిబ్రవరి 6: దుబ్బాక నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రమైన తొగుటలో శిథిలావస్థకు చేరుకున్న ఆర్ అండ్‌బీ అతిథి గృహంతో పాటు ఐకేపీ భవనాన్ని పరిశీలించి మాట్లాడారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి త్వరలో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు తుక్కాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘ నాయకులు కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట తొగుట ఎంపిపి లత నరేందర్‌రెడ్డి, తుక్కాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు విజయ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లింగాల కృష్ణ మాదిగ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గేయం అధికారిక ప్రకటనపై హర్షం

చేర్యాల, ఫిబ్రవరి 6: ఉద్యమ స్ఫూర్తిని రగిలించి స్ఫూర్తిదాయకంగా నిలిచిన జయజయహే తెలంగాణ జననీ జయకేతనం... గీతాన్ని ప్రభుత్వం అధికారిక గేయంగా ప్రకటించడంపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు పిన్నింటి రత్నం హర్షం వెలిబుచ్చారు. ఈ చర్య కవులు, కళాకారులను గౌరవించినట్లేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. కొమురవెల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగిన కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాకవి అందెశ్రీ రచించిన గీతం ఉద్యమ సమయంలో ప్రజలను ఏకం చేసిందని, అందెశ్రీని గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డికి కళాకారుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో కళాకారులు సంజీవ, శంకర్, గణేశ్, కనకరాజు, శ్రీనివాస్, సోమయ్య, చందు పాల్గొన్నారు.